

'సేవ'లు అంతంతే !

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు మీ సేవా కేంద్రాలు 100కు పైగానే ఉన్నా వినియోగదారులకు సరైన సేవలు అందడం లేదు.

8లో



రేషన్‌కార్డులతో ఆహారభద్రత

రేషన్‌కార్డుల ద్వారా పేదలకు ఆహార భద్రత లభిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు.

8లో



వాతావరణం

జిల్లాలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కోల్ మూమెంట్ ఈడీగా బాధ్యతల స్వీకరణ



ఈడీ వెంకన్నను అభినందిస్తున్న సీఎండీ బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కోల్ మూమెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బి.వెంకన్న సోమవారం బాధ్యతలు చేపట్టారు. 2010 ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీసెస్(ఐఆర్‌టీఎస్)కు చెందిన వెంకన్న మూడేళ్ల పాటు డిప్యుటేషన్‌పై ఈ పదవిలో నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన సీఎండీ ఎన్.బలరామ్‌ను కలిశారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ సింగరేణి సంస్థలో ప్రతీ సంవత్సరం సుమారు 700 లక్షల టన్నుల బొగ్గు రవాణా అవుతుందని, ఇందులో అధిక భాగం రైల్వే ద్వారానే పలు రాష్ట్రాల విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేస్తామని తెలిపారు. ఈ క్రమంలో కంపెనీ సాధిస్తున్న వార్షిక లక్ష్యాల సాధనలో కోల్‌మూమెంట్ విభాగం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందని, ఈ బాధ్యత కోల్‌మూమెంట్ ఈడీదేనని అన్నారు. అనంతరం ఈడీ మాట్లాడుతూ తనపై ఉన్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా నిబద్ధతతో పని చేస్తానని, లక్ష్య సాధనకు కృషి చేస్తానని చెప్పారు.

నేడు కరకగూడేనికి విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్

కరకగూడెం: రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి మంగళవారం కరకగూడెం మండలం భట్టుపల్లికి రానున్నారు. గ్రామంలోని రైతు వేదికలో కంది పంట విత్తనోత్పత్తిపై రైతులకు అవగాహన కల్పిస్తారు. కంది విత్తనోత్పత్తిని పెంచడం, నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావడం, తద్వారా రైతుల ఆదాయం పెంచడం తదితర అంశాలపై చర్చించనున్నారు. విత్తనోత్పత్తిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కార మార్గాలపై రైతులతో మాట్లాడుతారని మండల వ్యవసాయ శాఖ అధికారి చటర్జీ తెలిపారు. రైతులు నేడు ఉదయం 11 గంటల వరకు రైతు వేదిక వద్దకు రావాలని కోరారు.

తెరపైకి బైపాస్?



ఎన్‌హెచ్ 30 విస్తరణకు కేంద్రం సానుకూలం

- రుద్రంపూర్ – భద్రాచలం మధ్య ఫోర్ లేన్ రోడ్డు
- కొత్తగూడెం కార్పొరేషన్ చుట్టూ రానున్న బైపాస్..
- ప్రతిపాదనల్లోనే కొత్త జాతీయ రహదారులు
- ఎన్‌హెచ్ 930పీ పనుల్లో మాత్రం కనిపించని పురోగతి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర వ్యాప్తంగా రెండు వరుసలుగా ఉన్న 14 జాతీయ రహదారులను నాలుగు లేన్లుగా విస్తరించాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో జిల్లాకు సంబంధించి విజయవాడ – జగ్‌దల్‌పూర్ ఎన్‌హెచ్ 30కి చోటు దక్కింది. అయితే జిల్లాలోని ఇతర జాతీయ రహదారుల విస్తరణ, ప్రతిపాదనలు చాలా కాలంగా పెండింగ్‌లోనే ఉంటున్నాయి.

త్వరలో 'నాయ్' సర్వే..

విజయవాడ – జగదల్‌పూర్(ఎన్‌హెచ్ – 30) జాతీయ రహదారి వీఎం బంజర సమీపంలో మొదలై భద్రాచలం మీదుగా జగ్‌దల్‌పూర్ వెళ్తుంది. పదిహేనేళ్లుగా ఈ రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ఇందులో చివరి దశకు చెందిన కిన్నెరసానిపై రెండో వంతెన, భద్రాచలం పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు ఇప్పుడు టెండర్ల ప్రక్రియలో ఉన్నాయి. గోదావరిపై రెండో వంతెన, కొత్తగూడెంలో ముర్రేడు, గోధుమవాగులపై వంతెనలు గతేడాదే అందుబాటులోకి వచ్చాయి. తొలిదశ విస్తరణ సమయానికే రుద్రంపూర్ – కొత్తగూడెం – పాల్వంచ – పెద్దమ్మగుడి వరకు నాలుగు వరుసలుగా రోడ్డు ఉంది. ఎన్‌హెచ్ 30 మార్గంలో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీ, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రుద్రంపూర్ నుంచి భద్రాచలం వరకు ఉన్న రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించాలని తాజాగా నిర్ణయించారు. అందులో భాగంగా భారీ వాహనాలు కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోకి రాకుండా భద్రాచలం వైపు వెళ్లేలా కొత్తగూడెం బైపాస్ రోడ్డుకు తాజా విస్తరణలో చోటు కల్పించినట్టు సమాచారం. దీనికి సంబంధించిన అలైన్‌మెంట్‌పై త్వరలో సర్వే చేపట్టేందుకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (నాయ్) సిద్ధమవుతోంది.

నిర్మాణ పనుల్లో జాప్యం

హైదరాబాద్ – కొత్తగూడెం మార్గానికి నాలుగేళ్ల క్రితం 930పీ నంబర్‌తో ఎన్‌హెచ్ హోదా దక్కింది. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డులో గౌరారం వద్ద మొదలయ్యే ఈ రోడ్డు తొర్రూరు – మహబూబాబాద్ – ఇల్లెందు మీదుగా కొత్తగూడెం (ఇల్లెందు క్రాస్‌రోడ్డు) వరకు ఉంటుంది. ఇందులో కేవలం ఇల్లెందు మండలం నెహ్రూనగర్ నుంచి కొత్తగూడెం వరకు 54 కి.మీ. రోడ్డును ఫోర్‌లేన్‌గా నిర్మించాలని ముందుగానే నిర్ణయించారు. అయితే అటవీ అనుమతులు, భూసేకరణ, టెండర్ల ప్రక్రియలో జాప్యం కారణంగా ఈ పనులు ఇంతవరకూ మొదలే కాలేదు.

గోదావరికి ఇరువైపులా..

భద్రాచలం – వాజేడు రోడ్డును జాతీయ రహదారిగా విస్తరించాలని ఏజెన్సీ వాసులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. ఈ రోడ్డును జాతీయ రహదారిగా గుర్తిస్తే జగదల్‌పూర్ – విజయవాడ ఎన్‌హెచ్ 30, హైదరాబాద్ – భూపాలపట్నం ఎన్‌హెచ్ 161 కలుస్తాయి. ఇప్పటికే గోదావరికి కుడి వైపున సారపాక – ఏటూరునాగారం రోడ్డుకు జాతీయ హోదా కల్పించేందుకు కేంద్రం సానుకూలంగానే ఉంది. నదికి ఎడమ వైపున భద్రాచలం – వాజేడు రోడ్డుకు కూడా జాతీయ హోదా ఇప్పించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. దీంతో గోదావరి తీరానికి రెండు వైపులా రోడ్డు రవాణా సౌకర్యం మెరుగవడంతో పాటు భవిష్యత్‌లో జల రవాణాకు కూడా ఉపయోగపడుతుందని అంటున్నారు.

ఏడాదిగా మగ్గుతున్నాయి..

కొత్తగూడెం – తల్లాడ మార్గాన్ని జాతీయ రహదారిగా విస్తరించాలని కేంద్రాన్ని కోరినట్టు 2024 జూన్ 29న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. అందులో భాగంగా విజయవాడ – జగ్‌దల్‌పూర్ (ఎన్‌హెచ్ 30), దేవరపల్లి – ఖమ్మం (ఎన్‌హెచ్ 365బీబీ)లను కలుపుతూ కొత్తగూడెం – తల్లాడ – వైరా – జగ్గయ్యపేట వరకు ఉన్న 100 కి.మీ. రోడ్డును జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. అంతే కాదు.. గతంలోనే ఎన్‌హెచ్ హోదా వచ్చిన సారపాక – ఏటూరునాగారం మార్గానికి నంబర్ కేటాయించడంతో పాటు భద్రాచలం – బూర్గంపాడు – వేలేరుపాడు – అశ్వారావుపేట – రాజమండ్రికి బదులు పాల్వంచ – దమ్మపేట రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసినట్టు మంత్రి వెల్లడించారు. అయితే ఏడాది గడిచినా ఈ విషయంలో ఎలాంటి పురోగతి లేదు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్, హాజరైన వివిధ శాఖల అధికారులు

కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): వర్షాలు పెరుగుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు, హెల్త్ క్యాంపులు నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ వైద్య శాఖాధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం మంత్రులు, అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీస్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో ముందస్తుగా అవసరమైనంత మేరకు ఇసుక బస్తాలు సిద్ధంగా ఉంచాలని, ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా తక్షణమే స్పందించేలా యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని ఆదేశించారు. నీటి నిల్వలు ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఆ ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు తవ్వి దోమల వ్యాప్తిని నివారించాలని సూచించారు. యూరియా వంటి కీలక ఎరువుల సరఫరా విషయంలో రైతుల్లో ఆందోళన కలగకుండా ఉండేందుకు ప్రతి ఎరువుల దుకాణం ఎదుట అందుబాటులో ఉన్న స్టాక్ వివరాలు ప్రదర్శించేలా బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో తగినంత యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందొద్దని కోరారు. అవసరమైతే డిమాండ్‌కు అనుగుణంగా మరింత స్టాక్ సమకూర్చేందుకు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సౌరభ్‌శర్మ, సీపీఓ సంజీవరావు, డీపీఓ బాబూరావు, డీఎంహెచ్ఓ జయలక్ష్మి, ఇరిగేషన్ ఈఈ అర్జున రావు తదితరులు పాల్గొన్నారు.

కోయ భాషలో పెళ్లి పత్రిక

ఆవిష్కరించిన పీఓ రాహుల్



కోయ భాషలో ఉన్న పెళ్లి పత్రికలను ఆవిష్కరిస్తున్న పీఓ తదితరులు

భద్రాచలంటౌన్: కోయ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ ఆదివాసీ తెగల సమన్వయకర్త సోయం కన్నారాజు – శరణ్య తమ పెళ్లి పత్రికను కోయ భాషలో ముద్రించారు. ఈ పత్రికను ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సోమవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోయ భాషలో ఉన్న పెళ్లి పత్రికను చూడటం ఆనందంగా ఉందన్నారు. గిరిజనుల మాతృ భాషలో లిపి అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. అంతరించిపోతున్న ఆదివాసీ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు భవిష్యత్ తరాలకు అందించే ప్రయత్నంలో భాగంగానే ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేశామని చెప్పారు. నేటి తరం గిరిజన యువతకు వారి భాషపై మక్కువ కలిగేలా స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలు, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాల సందర్భంగా ఐటీడీఏ ద్వారా అందించే ఆహ్వాన పత్రికలు, ప్రభుత్వ ఉద్యోగులకు అందించే ప్రశంసాపత్రాలు కోయ భాషలోనే ముద్రించామని వివరించారు. అనంతరం వధూవరులు మాట్లాడుతూ.. ఐటీడీఏ పీఓ రాహుల్ కోయ భాష నేర్చుకుని భావితరాలకు ఆదర్శంగా నిలిచారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ఆగస్టు 3వ తేదీన పెళ్లి చేసుకోబోయే తాము వివాహ పత్రికను కోయ భాషలో ముద్రించామని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు డేవిడ్ రాజ్, సున్నం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భూవివాదంలో కుటుంబం వెలి

- రోళ్లపాడులో వెలుగుచూసిన ఘటన
- గ్రామంలో విచారణ చేపట్టిన పోలీసులు





వివాదాస్పద భూమిలో పరిశీలిస్తున్న డీఎస్పీ, పోలీసులు (ఇన్‌సెట్) బాధితులు పూనెం రామస్వామి – వెంకటరమణ దంపతులు

టేకులపల్లి: టేకులపల్లి మండలం రోళ్లపాడు గ్రామంలో ఓ అమానవీయ ఘటన చోటుచేసుకుంది. భూ వివాదంలో న్యాయం చేయాలని కోరిన కుటుంబాన్ని పెద్దలు కులం నుంచి వెలి వేస్తూ తీర్మానించారు. అంతేకాక ఈ విషయాన్ని గ్రామంలో టంకా వేయించడంతో ఆ కుటుంబం ఆవేదనకు గురవుతోంది. రోళ్లపాడు గ్రామానికి చెందిన పూనెం రామస్వామి – వెంకటరమణ దంపతులకు చెందిన ఆర్‌ఓఎఫ్ఆర్ పట్టా భూమిని అదే గ్రామానికి చెందిన కొడెం ముత్తయ్య కుటుంబీకులు ఆక్రమించి బోరు వేశారు. ఇదేంటని అడిగితే దౌర్జన్యానికి పాల్పడడంతో పటేల్ చీమల లక్ష్మీనారాయణ నాయకత్వాన గ్రామపెద్దలు పంచాయితీ పెట్టారు. అక్కడ అందరి ముందే రామస్వామి దంపతులపై దాడి జరిగింది. మరుసటి రోజు బోరు ధ్వంసం కావడంతో రామస్వామే కారణమని ఆరోపిస్తూ ఆదివారం రాత్రి మరోమారు పంచాయితీ పెట్టారు. ఈ పంచాయితీకి ఆలస్యంగా వచ్చారనే నెపంతో పటేల్, గ్రామ పెద్దలు, గ్రామస్తులంతా ఏకమై రామస్వామి కుటుంబాన్ని వెలివేస్తూ తీర్మానించారు. ఇకపై గ్రామస్తులెవరూ వారితో పాటు వారి కుటుంబీకుల ఇళ్లు, పొలాల్లో పనికి వెళ్లొద్దని చెప్పడమే కాక మాట్లాడొద్దని ఆదేశించారు. ఈ విషయాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తే రూ.50వేలు జరిమానా విధిస్తామని మైక్ ద్వారా గ్రామంలో టంకా వేయించారు. దీంతో ఆవేదనకు గురైన రామస్వామి దంపతులు సోమవారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు విన్నవించడమే కాక టేకులపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పోలీసుల విచారణ

రోళ్లపాడులో కుటుంబాన్ని వెలివేసినట్లు ఫిర్యాదు అందడంతో డీఎస్పీ నూనావత్ చంద్రభాను, సీఐ తాటిపాముల సురేష్, ఎస్‌ఐ అలకుంట రాజేందర్ గ్రామానికి వెళ్లి వివాదాస్పదమైన భూమిని పరిశీలించారు. ఆపై ఇరు వర్గాలను విచారించారు. అనంతరం గ్రామంలో ఇరువర్గాలతో సమావేశమై కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామ, కుల బహిష్కరణలు, వెలివేయడం చట్టరీత్యా నేరమని.. ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూమి పత్రాలతో రెవెన్యూ, అటవీ అధికారుల ద్వారా సర్వే చేయించి హద్దులు నిర్ణయించుకునే వరకు ఎవరూ వెళ్లొద్దని స్పష్టం చేశారు.

వర్షం.. రైతుల్లో హర్షం



జూలూరుపాడు : ఉధృతంగా ప్రవహిస్తున్న అన్నారుపాడు అలుగు వాగు



టేకులపల్లి సెంటర్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న వరద



కొత్తగూడెంలోని టీఎన్‌జీవోస్ కాలనీలో నిలిచిన వరద నీరు



రామవరం సమీపంలో ఇలా..

జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సోమవారం జోరు వాన కురిసింది. పత్తి, ఇతర విత్తనాలు వేసినా.. వర్షాభావంతో మొలకెత్తకపోవడం, కొన్ని చోట్ల మొలకలు వచ్చినా ఎండకు వడబడుతుండగా ఈ వర్షం ఊపిరి పోసిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టేకులపల్లి మండలంలోని తూర్పుగూడెం, రాంపురం వాగుల్లోకి నీరు చేరింది. జూలూరుపాడు మండలంలోనూ పలు వాగులు, కుంటల్లోకి నీరు చేరింది. అయితే ఈ వర్షంతో సింగరేణి కొత్తగూడెం ఏరియాలో 25వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం వాటిల్లింది. ఇక కొత్తగూడెంలోని టీఎన్‌జీవో కాలనీలో వర్షపు నీరు చేరగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలు రోడ్లు చెరువులను తలపించాయి.

– సింగరేణి(కొత్తగూడెం)/కొత్తగూడెం అర్బన్/టేకులపల్లి/జూలూరుపాడు

బరువెక్కిన ఎరువు

- పెరిగిన కాంప్లెక్స్ ఎరువుల ధరలు
- డీఏపీకి కొనసాగుతున్న కేంద్ర ప్రభుత్వ రాయితీ
- కొనుగోలుకు మొగ్గు చూపుతున్న రైతులు



బూర్గంపాడు మండలంలో ఎరువు చల్లుతున్న రైతు

బూర్గంపాడు: కాంప్లెక్స్ ఎరువుల ధరలు క్రమేపీ పెరుగుతూనే ఉన్నాయి. ప్రతీ వ్యవసాయ సీజన్‌లో ధరల పెంపుతో రైతులపై అదనపు భారం పడుతోంది. యూరియాతో పాటు కాంప్లెక్స్ ఎరువుల్లో డీఏపీకి కేంద్ర ప్రభుత్వం రాయితీ కొనసాగిస్తోంది. దీంతో ఈ రెండు ఎరువుల ధరలు మాత్రమే ప్రస్తుతం రైతులకు కొంతమేర అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో ప్రైవేట్ డీలర్లకు మార్క్‌ఫెడ్ నుంచి యూరియా సక్రమంగా సరఫరా కావడం లేదు. పీఏసీఎస్‌ల్లో మాత్రమే యూరియా అందుబాటులో ఉంటోంది. ప్రస్తుతం రైతులు పత్తి, వరి పంటలకు యూరియాతో పాటు కాంప్లెక్స్ ఎరువులు వేస్తున్నారు. అయితే ప్రైవేటు డీలర్ల వద్ద డీఏపీ కూడా అందుబాటులో ఉండడం లేదు. కొందరు డీలర్ల వద్ద ఉన్నా డీఏపీ కావాలంటే ఇతర ఎరువులు కొనాలంటూ లింక్ పెడుతున్నారు. ఐదు బస్తాల డీఏపీ కావాలంటే ఒక బస్తా క్యాల్షియం లేదా పొటాష్, లేదంటే నానో డీఏపీ, నానో యూరియా కొనాలంటూ షరతు విధిస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే తమకు డీఏపీ సరఫరా చేసే డిస్ట్రిబ్యూటర్లే ఇలా నిబంధనలు పెడుతున్నారని చెబుతున్నారు. ప్రస్తుతం యూరియా, డీఏపీకి డిమాండ్ పెరగడంతో కొందరు ప్రైవేటు డీలర్లు డీఏపీ బస్తాపై రూ. 50 అదనంగా వసూలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ రాయితీ పోగా రూ.1,350కి విక్రయించాల్సి ఉండగా ప్రస్తుతం రూ. 1400 చొప్పున అమ్ముతున్నారు.

చుక్కలనంటుతున్న ధరలు..

ఈ వానాకాలం సీజన్‌లో జిల్లాలో ఇప్పటివరకు 1.85 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. మరో 35 వేల ఎకరాల్లో సాగువుతందని అంచనా. వర్షాభావ పరిస్థితుల్లో కొన్ని మండలాల్లో ఆలస్యమైంది. వరి సుమారు 1.85 లక్షల ఎకరాల్లో సాగు చేస్తారని అధికారులు అంటున్నారు. గత పదిరోజులుగా వరి నాట్లు వేస్తున్నారు. నాట్లకు ముందే దుక్కిలో డీఏపీ వేస్తారు. పత్తిపంటకు కూడా తొలివిడత డీఏపీ, యూరియా కలిపి వేస్తున్నారు. ఈ తరుణంలో డీఏపీ, యూరియా ఎరువులు దొరకడం కొంత ఇబ్బందిగా మారింది. డీఏపీకి బదులుగా వేరే ఇతర కాంప్లెక్స్ ఎరువులు వేయాలంటే వాటి ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయి. గతేడాది రూ.1,300 ఉన్న 20:20:0:13 బస్తా ధర ఇప్పుడు రూ.1,400కు పెరిగింది. 10:26:26 బస్తా ధర గతేడాది రూ.1,470 ఉండగా ఇప్పుడు రూ.1,800కు చేరింది. 14:35:14 బస్తా ధర రూ. 1,700 నుంచి రూ.1,800కు పెరిగింది. గతేడాది రూ.1,535 ఉన్న పొటాష్ ధర ఇప్పుడు రూ. 1,900కు చేరింది. 15:15:15 ఎరువుల బస్తా ధర రూ.1,450 నుంచి రూ.1,600కు పెరిగింది. సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ రూ. 580 నుంచి రూ.640కి చేరింది. ఇలా కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరగడంతో రైతులు తొలి విడతలో డీఏపీ వినియోగానికి మొగ్గు చూపుతున్నారు. అయితే ఈ పరిస్థితుల్లో డీఏపీ దొరకకపోవడం, దొరికినా ఇతర ఎరువులు అంటగడుతుండడంతో వారికి తలకు మించిన భారంగా మారింది.

'నానో'పై అవగాహన కల్పించాలి..

కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరగడం, యూరియా కూడా సరిగా దొరకకపోవడం రైతులకు ఇబ్బందికరంగా మారింది. ఈ తరుణంలో వ్యవసాయ అధికారులు నానో యూరియా, నానో డీఏపీ వినియోగించాలని రైతులకు సూచిస్తున్నారు. అయితే ద్రవరూప ఎరువుల వినియోగంపై పెద్దగా ఆసక్తి లేని రైతులు గుళికల ఎరువులకే ప్రాధాన్యత ఇస్తున్నారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పర్యటించి నానో యూరియా, నానో డీఏపీ వాడకంపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరముందని పలువురు అంటున్నారు.

ఇతర ఎరువులు అంటగడుతున్నారు



డీఏపీ కొనాలంటే దాంతో పాటు ఇతర ఎరువులు కూడా అంటగడుతున్నారు. ఐదు బస్తాల డీఏపీ కొనాలంటే ఒక బస్తా క్యాల్షియం కొనాల్సిందేనని వ్యాపారులు చెబుతున్నారు. అవసరం కోసం తప్పనిసరి పరిస్థితుల్లో వాటిని కూడా కొనాల్సి వస్తోంది. మిగతా కాంప్లెక్స్ ఎరువుల ధరలు బాగా పెరగడంతో డీఏపీనే వేస్తున్నాం.

– యడమకంటి నర్సింహారెడ్డి, రెడ్డిపాలెం

రేపటి నుంచి 'నవోదయ' క్రీడాపోటీలు

కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో క్లస్టర్ స్థాయి క్రీడా పోటీలు జరగనున్నాయి. ఇక్కడ బుధ, గురువారాల్లో జరిగే పోటీల్లో పాలేరుతో పాటు రాష్ట్రంలోని మిగతా నవోదయ విద్యాలయాల విద్యార్థులు పాల్గొంటారు. బాలబాలికలకు అండర్ –14, 17, 19 విభాగాల్లో కబడ్డీ, ఖో–ఖో, బ్యాడ్మింటన్, టీటీ, చెస్, యోగా పోటీలను నిర్వహిస్తారు. ఈ పోటీల్లో పాలేరు విద్యాలయం నుండి 68మంది, ఇతర జిల్లాల నుండి మరో 349 మంది విద్యార్థులు పాల్గొంటారు.

చెక్‌డ్యామ్ ఎత్తు తగ్గింపు పనులు ప్రారంభం



వరద వెళ్లేలా చప్టా తొలగించిన దృశ్యం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం ప్రకాష్‌నగర్ వద్ద మున్నేటిపై ఉన్న చెక్‌డ్యామ్ ఎత్తు తగ్గింపు పనులు మొదలయ్యాయి. జలవనరుల శాఖ, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో చెక్‌డ్యామ్ వద్దకు యంత్రాలు వెళ్లేలా అడ్డుగా ఉన్న గుర్రపు డెక్కను రెండు రోజులుగా తొలగిస్తున్నారు. ఇదేసమయాన చెక్‌డ్యామ్ దిగువన ప్రకాష్‌నగర్ వంతెన చప్టాకు గండ్లు పెట్టి వరద నీరు ముందుగా వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. నగరాన్ని వరద ముంపు నుంచి రక్షించేందుకు చెక్‌డ్యామ్ ఎత్తు సగం మేర తగ్గించాలని నిర్ణయించిన విషయం విదితమే. ఈమేరకు వరద ప్రవాహం ఆధారంగా ఒకటి, రెండు రోజుల్లో గ్రానైట్ కట్టర్ సాయంతో చెక్‌డ్యాం ఎత్తు తగ్గించే పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

నేడు, రేపు మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళ, బుధవారాల్లో ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మంలోని విజయ డెయిరీ యూనిట్‌ను మంగళవారం ఉదయం పరిశీలించనున్న మంత్రి నిర్వహణపై అధికారులతో సమీక్షిస్తారు. ఆతర్వాత ఖమ్మం 15వ డివిజన్‌లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఇక బుధవారం కొత్తగూడెంలోని ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ క్యాంపస్‌ను సందర్శించి ఉన్నతాధికారులతో సమీక్షలో పాల్గొంటారు. ఆపై సాయంత్రం 3 గంటలకు రఘునాథపాలెం మండలం పరికలబోడు తండాలో రహదారుల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేయనున్నారు.

గూడ్స్ రైలు నుంచి విడిపోయిన బోగీలు



కారేపల్లి గేట్ వద్ద నిలిచిపోయిన బోగీలు

కారేపల్లి: లింక్ ఊడిపోవడంతో గూడ్స్ రైలు నుంచి కొన్ని బోగీలు విడిపోయిన ఘటన కారేపల్లి మండలం గేటుకారేపల్లి స్టేషన్ సమీపాన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. డోర్నకల్ జంక్షన్ నుంచి కారేపల్లి రైల్వే జంక్షన్ మీదుగా ఖాళీ బోగీలతో గూడ్స్ రైలు కొత్తగూడెం వైపు వెళ్తోంది. గేటుకారేపల్లి స్టేషన్ సమీపానికి వచ్చే సరికి కొన్ని బోగీలకు లింగ్ ఊడిపోయింది. దీంతో కొన్ని బోగీలను వదిలేసి ఇంజిన్ ఇంకొన్ని బోగీలతో వెళ్తుండడాన్ని గేటుకారేపల్లి, అనంతారం గేట్‌మెన్లు గుర్తించి అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో డ్రైవర్‌ను అప్రమత్తం చేసి గూడ్స్ రైలును నిలిపివేయగా, ఆతర్వాత సిబ్బంది చేరుకుని ఊడిపోయిన బోగీలను మరో ఇంజన్ సాయంతో తీసుకొచ్చి జత చేశారు. దీంతో అరగంట తర్వాత గూడ్స్ రైలు ముందుకు కదిలింది. ఇదే సమయాన గేటుకారేపల్లి, అనంతారం గేట్లను మూసివేయడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

పిడుగుపాటుతో మహిళ మృతి



కోరం రమణ (ఫైల్)

పినపాక: పొలంలో వరి నాటు వేస్తుండగా పిడుగు పడి మహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని బోటుగూడెంలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోరం రమణ (55) తోటి కూలీలతో వరి పొలంలో నాటు వేసేందుకు వెళ్లింది. ఈ క్రమంలో పని ప్రదేశంలోనే పిడుగుపడగా కుప్పకూలిన రమణను కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు.

సుజాతనగర్‌లో 13 మేకలు..



పిడుగుపాటుతో మృతిచెందిన మేకలు

సుజాతనగర్: పిడుగుపాటుతో 13 మేకలు మృతిచెందిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానిక అంబేద్కర్ నగర్‌కు చెందిన కేసుపాక పుల్లయ్య మేకలను మేత కోసం రాఘవాపురం రోడ్డు పక్కన గల జామాయిల్ తోటలోకి తీసుకెళ్లాడు. అయితే భారీ వర్షం కురవడంతో పాటు మేకలపైనే పిడుగు పడడంతో అవి అక్కడికక్కడే మృతిచెందాయి. జీవనాధారమైన మేకల మరణంతో తనకు సుమారు రూ.2లక్షల మేర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం పరిహారం అందించాలని పుల్లయ్య వేడుకున్నాడు. కాగా, మేకల కాపరి పుల్లయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి కుమారి హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి చింతలపూడి శేఖర్ ప్రభుత్వాన్ని కోరారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,463

'సేవ'లు అంతంతే !

- మీ సేవా కేంద్రాల్లో తప్పని తిప్పలు
- రోజుకు 100 మందికి కూడా అందని సర్వీసులు
- శిథిల భవనాల్లోనే సెంటర్ల నిర్వహణ



సేవల కోసం వచ్చిన వినియోగదారులు



మీ సేవా కేంద్రంలో శిథిలమైన సామగ్రి

ఇల్లెందు: జిల్లాలో మీ సేవా కేంద్రాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా.. వాటిలో వినియోగదారులకు అందే సేవలు మాత్రం అంతంతగానే ఉన్నాయి. జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలు 11 ఉండగా ప్రైవేట్ సెంటర్లు సుమారు 100 ఉన్నాయి. ప్రతీ సంవత్సరం కొన్ని కొత్త కేంద్రాలకు అనుమతి ఇస్తున్నారు. ఇక కొన్ని మండలాల్లో నాలుగైదుకు తగ్గకుండా కేంద్రాలకు ఉండగా, ఇంటర్నెట్ సిగ్నల్ సరిగా లేని చోట సెంటర్లు ఏర్పాటు చేయలేదు. ఉన్నచోట కూడా ఆశించిన స్థాయిలో సేవలు అందడం లేదు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని కేంద్రాలు సక్రమంగా పనిచేయక పట్టణాలకు పరుగు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో మున్సిపాలిటీల వద్ద ఉన్న సెంటర్లకు తాకిడి పెరుగుతోంది. ఇల్లెందులోని మీ సేవా కేంద్రానికి ఇల్లెందు, టేకులపల్లి, ఆళ్లపల్లి, గుండాల మండలాల నుంచి వినియోగదారులు వస్తుండగా సదుపాయాలు అంతంతగానే ఉన్నాయి. కంప్యూటర్లు, స్కానర్లు, ఇతర పరికరాలు సరిగా పనిచేయక పోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు నిరాశగా వెనుదిరుగుతున్నారు.

తీరని ఆధార్ గోస..

జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా ఆధార్, కుల, ఆదాయ సర్టిఫికెట్లు, రేషన్‌కార్డులు తదితర అవసరాల కోసం ప్రజలు మీ సేవా కేంద్రాల వద్ద బారులుదీరుతున్నారు. ముఖ్యంగా ఆధార్‌కార్డుల్లో తప్పుల సవరణ, అప్‌డేట్ కోసం ఎక్కువ మంది వస్తున్నారు. పలువురికి ఆంధ్రప్రదేశ్, ఖమ్మం జిల్లా పేరుతోనే ఆధార్ కార్డులు ఉండగా.. వాటి సవరణల కోసం కూడా భారీగా వస్తున్నారు. ఇక ప్రజా పాలన గ్రామసభల్లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు రేషన్ కార్డులు రావడం లేదు కానీ.. మీ సేవా కేంద్రంలో డబ్బు ముట్టజెప్పి దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే వస్తుండడంతో వారు కూడా పోటెత్తుతున్నారు.

అత్యవసర సేవల్లో జాప్యం..



ఇది ఇల్లెందులోని మీ సేవా కేంద్రం. ఇక్కడ ఏ ఒక్క లబ్ధిదారుడికీ సేవలు అంత సులభంగా లభించవు. కొన్ని నెలలుగా స్టేషనరీ సరఫరా కావడం లేదు. నలుగురు కంప్యూటర్ ఆపరేటర్లకు ముగ్గురే పని చేస్తున్నారు. ఇందులోనే ఒకరిని ఆధార్ కార్డులకు, మరొకరిని బిల్లులు, సర్టిఫికెట్ల జారీకి కేటాయించారు. ఏ కంప్యూటర్ చూసినా సర్వర్ బిజీ వస్తోందని ఆపరేటర్లు సమాధానం చెబుతున్నారు. దీంతో భారీ సంఖ్యలో సర్టిఫికెట్లు పెండింగ్‌లో ఉంటున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 11 కేంద్రాలు..

ఉమ్మడి జిల్లాలో ఖమ్మం, కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, మధిర, వైరా, సత్తుపల్లి, పాల్వంచ, అశ్వారావుపేట, ఏదులాపురం, కల్లూరులో మీ సేవా కేంద్రాలు ఉన్నాయి. ప్రతీ మున్సిపాలిటీలో ఒక మీ సేవా కేంద్రం ఉంది. వాటిలో 100కు పైగా సేవలు అందుతున్నాయి. కానీ ఏ కేంద్రంలోనూ మూడుకు మించి కంప్యూటర్లు లేవు. ఉన్నవి కూడా సక్రమంగా పని చేయడం లేదు. ఫర్నిచర్ విరిగి, లైట్లు, ఫ్యాన్లు పనిచేయక, భవనాలు శిథిలావస్థకు చేరడంతో అటు నిర్వాహకులు, ఇటు వినియోగదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

పడిగాపులు కాస్తున్నాం



గుండాల మండలంలో మీ సేవా కేంద్రం లేక ఇల్లెందుకు వచ్చి రోజంతా పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఆధార్ కార్డు పని కోసం వస్తే ఒక రోజు కాకపోవడంతో రెండు, మూడు రోజుల పాటు రావాల్సి వస్తోంది. గుండాలలోనే మీ సేవా కేంద్రం ఏర్పాటు చేస్తే మాకు ఈ ఇబ్బందులు ఉండవు. ప్రయాణ ఖర్చులు కూడా మిగులుతాయి.

– ఈసం సమ్మయ్య, జగ్గాయిగూడెం, గుండాల మండలం

రిపేర్లు ఉంటేనే జాప్యం



ఇల్లెందు మీ సేవా కేంద్రం గత నాలుగేళ్లుగా రిపేరు దశలో ఉంది. గతంలో ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించినా పనులు ప్రారంభం కాలేదు. స్టేషనరీకి ఇబ్బంది లేదు. కంప్యూటర్లు, స్కానర్లు రిపేర్‌కు వస్తే మూడు, నాలుగు రోజుల్లో రీప్లేస్ చేస్తుంటారు. అలాంటప్పుడు ఒకటి, రెండు రోజులు పనులు ఆగుతాయి. ఎక్కువగా ఆధార్, కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం వస్తుంటారు. – సత్యనారాయణ, ఇల్లెందు మీ సేవా కేంద్రం ఆపరేటర్

మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 11 మీ సేవా కేంద్రాలు ఉన్నాయి. వీటిలో చాలా వరకు రిపేరుకు వచ్చాయి. అయితే ఏ వస్తువు చెడిపోయినా వెంటనే అందజేస్తున్నాం. భవనాల మరమ్మతు, రెనవేషన్ కోసం ప్రతిపాదనలు పంపించాం. కంప్యూటర్‌లు, స్కానర్‌లు, ఇతర మెటీరియల్ కోసం కూడా ఇండెంట్ పెట్టాం.

– యుగంధర్ రెడ్డి, ఉమ్మడి జిల్లా మీ సేవా కేంద్రాల కో ఆర్డినేటర్

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పోరాటాలు



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పద్మ

ఖమ్మంసహకారనగర్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యాన నిర్వహించే పోరాటాలను జయప్రదం చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి పిలుపునిచ్చారు. ఖమ్మంలో సోమవారం టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశం షేక్ రంజాన్ అధ్యక్షతన జరగగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 19నెలలు గడిచినా ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్‌సీ ఇవ్వకుండా జాప్యం చేస్తోందన్నారు. ఇకనైనా పీఆర్‌సీ అమలుచేయడమే కాక ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ ప్రకటించాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలనే డిమాండ్‌తో చేపట్టే దశలవారీ పోరాటంలో ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు బుర్రి వెంకన్న, వల్లంకొండ రాంబాబు, దామోదర్, అరవింద్, రాంచంద్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి..

ఉపాధ్యాయ సమస్యలపై దశలవారీ పోరాటాలను జయప్రదం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వై.పద్మ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 23, 24వ తేదీల్లో తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇవ్వనుండగా, ఆగస్టు 1న జిల్లా కేంద్రంలో, ఆగస్టు 23న రాష్ట్రస్థాయిలో మహాధర్నా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో టీపీటీఎఫ్ కార్యదర్శి అకుల నాగేశ్వరరావు, నాయకులు గరిక శ్రీనివాస్, హన్మంతరావు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కారు టైర్‌కు పంక్చర్



టైర్ మారుస్తున్న సిబ్బంది

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో అభివృద్ధి పనులను సోమవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వచ్చిన కారు టైర్ పంక్చర్ అయింది. దీంతో మంత్రి పరిశీలన ముగిసేలోగా సిబ్బంది కారు టైరు మార్చారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

26 నుంచి సీపీఐ జిల్లా మహాసభలు



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

అశ్వారావుపేటరూరల్: ఈ నెల 26, 27వ తేదీల్లో అశ్వారావుపేటలోని శ్రీశ్రీ ఫంక్షన్ హాల్ జరిగే సీపీఐ జిల్లా మూడో మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా కోరారు. సోమవారం అశ్వారావుపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చారిత్రాత్మక పోరాటాల ప్రాంతం, ఏజెన్సీ గ్రామాలకు కేంద్రమైన అశ్వారావుపేటలో జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నామని, ఈ సభలకు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సభల్లో భవిష్యత్తు ఉద్యమాల రూపకల్పన, జిల్లా అభివృద్ధి సాధన, రానున్న మూడేళ్ల కార్యచరణను నిర్ణయిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌డి.సలీం, నారాటి ప్రసాద్, గన్నిన రామ్మకృష్ణ, విజయ్‌కాంత్, ఎస్‌డి.జాకీర్, సత్యవతి, సూర్యకుమారి, రిజ్వాన పాల్గొన్నారు.

నారు మడి.. కోక తడి !



మిర్చి సాగుకు సిద్ధమవుతున్న రైతులు నారు పెంచుతున్నారు. మడుల్లో మిరప గింజలను విత్తగా.. ఎండావాన నుంచి రక్షణకు పాత చీరలను వాడుతున్నారు. నారు మడులపై పాత చీరలు పరిచి నిత్యం నీరు పెడుతుండగా.. తేమ త్వరగా ఆరిపోదని చెబుతున్నారు. ఒకవేళ భారీ వర్షం కురిసినా గింజలు కొట్టుకుపోకుండా చీరలే కాపాడతాయని.. మొలకలు వచ్చాక వీటిని తీసివేస్తామని రైతులు తెలిపారు. కామేపల్లి మండలం పండితాపురం సమీపాన ఓ రైతు నారుపై పరిచిన చీరలే ఇవి.

– కామేపల్లి

రేషన్‌కార్డులతో ఆహారభద్రత

- 93లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీతో రికార్డు
- సమపాళ్లలో అభివృద్ధి, సంక్షేమం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



బోనకల్ : రేషన్‌కార్డులు మంజూరు పత్రాలు అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, పక్కన వైరా ఎమ్మెల్యే రాందాస్ తదితరులు

బోనకల్: రేషన్‌కార్డుల ద్వారా పేదలకు ఆహార భద్రత లభిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. బోనకల్‌లో సోమవారం ఆయన నియోజకవర్గవ్యాప్తంగా ఇటీవల మంజూరైన రేషన్‌కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వకుండా పేదలను ఇబ్బంది పెట్టిందని ఆరోపించారు. కానీ తాము అధికారంలోకి రాగానే అర్హత కలిగిన పేదలందరికీ రేషన్‌కార్డులు ఇచ్చేలా చర్యలు చేపట్టామని తెలిపారు. రాష్ట్రంలో 1.15కోట్ల కుటుంబాలు ఉండగా 93లక్షల కుటుంబాలకు రేషన్‌కార్డులు ఇవ్వడమే కాక సన్నబియ్యం పంపిణీతో దేశంలోనే రికార్డు సృష్టించామని చెప్పారు. జిల్లాలో 19,690 కార్డులు కొత్తగా మంజూరు చేశామి, మధిర నియోజకవర్గంలో 4,736 కొత్త కార్డులు మంజూరు చేయడంతో పాటు 13,767 మంది పేర్లను చేర్చామని తెలిపారు. ఇక 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరాతో రాష్ట్రంలో 51 లక్షల కుటుంబాలకు, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి పెంపుతో 93 లక్షలకు లబ్ధి జరిగిందని వెల్లడించారు. కేవలం సంక్షేమ కార్యక్రమాలే కాక అభివృద్ధిని సమపాళ్లలో చేపడుతూ రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలుపుతుమని డిప్యూటీ సీఎం భట్టి తెలపారు. తొలుత బోనకల్ మండలంలోని చిరునోములలో రూ.1.72కోట్లు, రావినూతలలో రూ.1.62కోట్లతో నిర్మించే సీసీ రోడ్లకు భట్టి శంకుస్థాపన చేశారు.

దశల వారీగా ఇందిరమ్మ బిల్లులు

చింతకాని: చింతకాని మండలం గాంధీనగర్ కాలనీలో రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సోమవారం ప్రారంభించారు. అలాగే, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా చేపట్టాలని, తద్వారా దశల వారీగా బిల్లులు మంజూరవుతాయని తెలిపారు. కాగా, డిప్యూటీ సీఎం భట్టి చింతకాని మండలంలోకి ప్రవేశించగానే భారీ వర్షం మొదలవడంతో ఆ వర్షంలోనే గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించాక రైతువేదికలో దళితబంధు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యం, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు కస్తాల సత్యనారాయణ, నవీన్‌బాబు, సన్యాసయ్య, చందన్‌కుమార్, ధనసరి పుల్లయ్య, ఆశాలత, శ్రీనివాసాచారి, సునీల్‌రెడ్డి, ఆర్‌డీఓ నరసింహారావు, తహసీల్దార్లు కరుణాకర్‌రెడ్డి, రమాదేవి, ఎంపీడీఓలు శ్రీనివాసరావు, రమాదేవి, ఆత్మ, మార్కెట్ చైర్మన్లు కె.రామకోటేశ్వరరావు, బండారు నర్సింహారావు, ఏఓ మానసతో పాటు నాయకులు పైడిపల్లి కిషోర్, బందం నాగేశ్వరావు,గాలి దుర్గారావు, పిల్లలమర్రి నాగేశ్వరావు, షాజహాన్, జానీమియా, బోయినపల్లి వెంకటేశ్వర్లు, మురళి, ముస్తఫా, శాస్త్రి, చేబ్రోలు వెంకటేశ్వర్లు, రామకృష్ణ, భద్రు నాయక్, ప్రమీల పాల్గొన్నారు.

అలంకార ప్రాయంగా అటవీ చెక్ పోస్టులు

వైల్డ్‌లైఫ్ విభాగాన్ని వేధిస్తున్న సిబ్బంది కొరత



మొండికట్ట వద్ద మూసి ఉన్న వైల్డ్‌లైఫ్ చెక్‌పోస్టు

పాల్వంచరూరల్: వైల్డ్‌లైఫ్ పాల్వంచ డివిజన్ విభాగంలో వన్యప్రాణుల సంరక్షణతో పాటు కలప స్మగ్లింగ్‌ను నిరోధించేందుకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో సిబ్బంది లేక అలంకార ప్రాయంగా మారుతోంది. యానంబైల్ రేంజ్ పరిధిలోని మొండికట్ట వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసినా.. కొద్ది రోజులుగా తాళం వేసి ఉంటోంది. ఇక్కడ విధులు నిర్వహించే ఎఫ్‌బీఓ మోహన్‌కు రేగులగూడెంలో రెండు బీట్ల బాధ్యతలు అప్పగించారు. అయితే చెక్‌పోస్టు పర్యవేక్షణ బాధ్యతను మాత్రం ఎవరికీ అప్పగించలేదు. మొండికట్టలో విధులు నిర్వహించే సురేష్‌కుమార్ డిప్యుటేషన్‌పై వెళ్లారు. యానంబైల్ బీట్ ఆఫీసర్ గ్రూప్–1 శిక్షణకు వెళ్లారు. కిన్నెరసాని చెక్‌పోస్టులో విధులు నిర్వహించే భట్టు రాములు ఉద్యోగోన్నతి పై దమ్మపేట రేంజ్‌కు వెళ్లారు. ఇలా ఈ రేంజ్ పరిధిలో మొత్తం 20 మంది విధులు నిర్వహించాల్సి ఉండగా అరకొర సిబ్బంది కారణంగా చెక్‌పోస్టులో ఎవరూ ఉండడం లేదని తెలుస్తోంది. రేంజ్ పరిధిలో వన్యప్రాణులు, అభయారణ్యంలోని కలప అక్రమ రవాణాను నిరోధించేందుకు ఆరేళ్ల క్రితం ఉల్వనూరు – పాల్వంచ మార్గంలోని మొండికట్ట వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. కానీ సిబ్బంది లేక అది నిరుపయోగంగానే ఉంది. ఈ విషయమై ఇన్‌చార్జ్ ఎఫ్‌డీఓ కృష్ణమాచారిని వివరణం కోరగా మొండికట్ట చెక్‌పోస్టులో విధులు నిర్వహించే ఎఫ్‌బీఓకు రేగులగూడెంలో రెండు బీట్లకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించామని తెలిపారు. సిబ్బంది కొరత ఉందని, ఖాళీల భర్తీకి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. చెక్‌పోస్టు వద్ద త్వరలోనే ఒకరిని నియమిస్తామన్నారు.

నేరాలు, ప్రమాదాల నియంత్రణకే కార్డన్ సెర్చ్

ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను



మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందురూరల్: నేరాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను తెలిపారు. మండలంలోని 21 పిట్ ఏరియాలో సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత గంజాయి, మద్యం, గుట్కా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను అతి వేగంగా, అజాగ్రత్తగా నడపొద్దని కోరారు. వీటితో కలిగే ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే జరిమానాతోపాటు జైలు శిక్ష కూడా ఉంటుందని హెచ్చరించారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని అన్నారు. గ్రామాల్లోకి అనుమానిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అంతకు ముందు ఇంటింటికీ వెళ్లి వాహనాలను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ పేపర్లు, ఇతర పత్రాలు లేని వాహనాలను పోలీసుస్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో సీఐలు రవి, సురేష్, ఎస్సైలు శ్రీనివాసరెడ్డి, సూర్య, నాగుల్‌మీరా, హసీనా పాల్గొన్నారు.

మద్యానికి బానిసైన వ్యక్తి మృతి

పినపాక: మద్యానికి బానిసైన వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని తోగూడెంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఇర్పా నరేష్(35) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని నెలలుగా మద్యానికి బానిసై కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటున్నాడు. రెండు రోజుల క్రితం కట్టెల కోసం వెళ్లి తిరిగి వచ్చి మద్యం సేవించి తన పాత ఇంట్లో పడుకున్నాడు. మద్యం సేవించినప్పుడల్లా తిరుగుతుంటాడని భావించిన కుటుంబసభ్యులు సాయంత్రం వరకు వెదికి వదిలేశారు. కాగా, పాత ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు నరేష్ మృతిచెందినట్లు గుర్తించారు. తండ్రి బిక్షం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై సురేష్ తెలిపారు.

బీరప్ప ఆలయంలో చోరీ



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలంలోని పెంట్లంగ్రామంలో గల బీరప్ప ఆలయంలో ఆదివా రం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు ఎస్‌ఐ సీహెచ్ చంద్రశేఖర్ సోమవారం సిబ్బందితో కలిసి ఘటనస్థలాన్ని పరిశీలించా రు. గుర్తు తెలియని దుండగులు ఆలయంలోని హుండీని పగులగొట్టి సుమా రు రూ.10వేల నగదు అపహరించుకెళ్లారని ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

వేంసూరు: ఏపీలోని వాడపల్లిలో గోదావరిలో గల్లంతైన యువకుడి మృతదేహం సోమవారం లభ్యమైంది. వేంసూరు మండలం లచ్చన్నగూడెంకు చెందిన పామర్తి సాయిదినేష్ ఈనెల 19న స్నేహితులతో కలిసి వాడపల్లిలో వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లగా అక్కడ గోదావరిలో గల్లంతయ్యాడు. అప్పటి నుంచి రెస్క్యూ బృందాలు గాలిస్తుండడంగా సోమవారం మృతదేహం లభించడంతో కుటుంబీకులకు అప్పగించారు.

వీధి కుక్కల దాడిలో ముగ్గురికి తీవ్ర గాయాలు

భద్రాచలం అర్బన్: భద్రాచలంలో వీధి కుక్కలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీకి చెందిన 8వ తరగతి విద్యార్థిని స్కూల్ బ్యాగ్ ధరించుకొని వెళుతుండగా, వీధికుక్కలు ఆమెపై దాడిచేశాయి. దీంతో విద్యార్థినికి తీవ్రగాయాలయ్యాయి. ఆమె ఆర్తనాదాలు విన్నస్థానికులు కుక్కలను తరిమి, బాలికను ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో మరో పాపను, రెవెన్యూ కాలనీలో ఓ వ్యక్తికి కూడా వీధి కుక్కలు కరిసి గాయపర్చాయి. పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు కాలనీల్లో కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల బెడదతో పిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారని, కుక్కల నియంత్రణకు అధికారులు తక్షణమే చొరవ చూపాలని కోరుతున్నారు.